PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 274 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 30 సెప్టెంబర్ 2025


### ప్రజలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు




### ఘనంగా బతుకమ్మ వేడుకలు




## సరస్వతీ అలంకారంలో
# కనకదుర్గమ్మ
### అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చంద్రబాబు



**విజయవాడ, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్)** : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగు తున్నాయి. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం కావడంతో శ్రీ సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. దుర్గమ్మ వారి దర్శనానికి సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల కోసం నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనం మరో ఆరు నెలలో మిగతా2లో...

## ఢిల్లీ బిజెపికి కొత్త కార్యాలయం
### - ప్రారంభించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బీజేపీ ఢిల్లీ శ్రేణుల్లో సంబరాలు నెలకొన్నాయి. దీన్ దయాళ్ మార్గ్‌లో కొత్తగా నిర్మించిన ఢిల్లీ బీజేపీ కార్యాలయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు ప్రారంభించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్, పలువురు కేంద్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు, పార్టీ మిగతా2లో...






## మోగిన స్థానిక ఎన్నికల
# నగారా

- బిసి రిజర్వేషన్ల జీవో విడుదలతో లైన్ క్లీయర్
- మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహణ
- తొలుత ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు
- తరవాత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కుముదిని

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. బిసి రిజర్వేషన్లపై భారీ కసరత్తు జరిగినా చివరకు 42 శాతం బిసి రిజర్వేషన్లకు జివో విడుదల కావడంతో స్థానిక ఎన్నికలకు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో 565 మండలాల్లో 5,749 ఎంపీటీసీ, 656 జడ్పీటీసీ స్థానాలకు, 12,733 గ్రామ పంచాయతీలు, 1లక్షా 12వేల288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మిగతా2లో...

## పైరసీతో నిర్మాతలకు కోట్లల్లో నష్టాలు
### మొదటిసారిగా పైరసీ గ్యాంగ్‌ను పట్టుకున్నాం : సీపీ ఆనంద్



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సినిమాల పైరసీ వల్ల నిర్మాతల కష్టం వృథా అవుతోందని.. ఈ పరిశ్రమ బాగా ప్రభావానికి గురవుతోందని హైదరాబాద్ సీపీసీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. పైరసీపై తెలుగు ఫిలిం చాంబర్ మిగతా2లో...

## స్థానికంలో కాషాయ జెండా ఎగురవేస్తాం : రాంచందర్‌రావు




## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు
# పరాభవం తప్పదు

- ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన రేవంత్ సర్కార్
- కాంగ్రెస్ మోసాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రజలు
- ఏ ఎన్నికులు వచ్చినా గెలిచి తీరుతాం : కేటీఆర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరితోపాటు పలువురు వివిధ మిగతా2లో...



## గిన్నిస్ రికార్డు సాధించిన తెలంగాణ బతుకమ్మ

**హైదరాబాద్, 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించింది. అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రికార్డు మిగతా2లో...

### నగరంలో పేదలకు రూ.5కే
# అల్పాహారం
### రెండుచోట్ల ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్‌లోని పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా క్యాంటీన్' పథకాన్ని రేవంత్ సర్కార్ ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం, ఐదు రూపాయలకే మధ్యాహ్న భోజనం అందించనున్నారు. మోతీనగర్, మింట్ కాంపౌండ్ ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. జీహెచ్ఎంసీ మిగతా2లో...



## తన స్టాప్ వచ్చిసింది..
## ప్రయాణం కొనసాగుతుంది
### - చివరి రోజు బస్‌లో ప్రయాణం... సజ్జనార్ ఆసక్తికర ట్వీట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ పదవి నుంచి హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌గా బదిలీ కావడంపై వీసీ సజ్జనార్ భావోద్వేగానికి లోనవుతూ తన 'ఎక్స్' ఖాతాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన స్టాప్ వచ్చేసిందని.. బస్సు దిగి కొత్త మార్గం వైపు అడుగులేసే సమయం వచ్చిందని ఆయన పోస్ట్ చేశారు. ప్రయాణాలు ముగుస్తుంటాయని, మిగతా2లో...



## నిండుకుండల్లా తెలంగాణలోని
# ప్రధాన ప్రాజెక్టులు
### శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద ప్రవాహం

**నిజామాబాద్, 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులైన సింగూరు, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్‌లకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో జలాశయాలు నిండుకుండలా మారాయి. అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు ప్రాజెక్టు 10 గేట్లను మిగతా2లో...

## గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ
# విధ్వంసం

- సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ
- ప్రభుత్వంపై బిఆర్ఎస్ బురద జల్లుతూ విమర్శలు
- మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



# ఢిల్లీ బిజెపికి కొత్త కార్యాలయం

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలు ఈ కార్యక్రమలో పాల్గొన్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయానికి సమీపంలోనే ఈ కొత్త కార్యాలయం ఏర్పాటు కాగా, ప్రస్తుతం పండిట్ పంత్ మార్గ్ నుంచి పని చేస్తున్న ఢిల్లీ బేజీపీ కార్యాలయం ఇక నుంచి దీన్ దయాల్ ఉపాధ్యాయ్ మార్గ్ నుంచి పనిచేయనుంది. ఇప్పటి వరకూ అ÷-దదెకుండటం, తాత్కాలిక కార్యాలయాల్లో పని చేసిన బీజేపీ కార్యాలయానికి ఇప్పుడు సొంత కార్యాలయం రావడం, అదికూడా నవరాత్రి రోజుల్లో ప్రారంభం కావడం పార్టీ శ్రేణుల్లో సంబరాలు నింపింది. బీజేపీ కొత్త కార్యాలయాన్ని 825 చదరుపు మీటర్ల ప్లాట్‌లో 5 అంతస్తులతో నిర్మించారు. వాహనాల పార్కింగ్ కోసం రెండు బేసమెంట్ లెవెల్స్ ఉన్నాయి. ఎకో-ఫ్రెండీ, అధునాతన సౌకర్యాలతో కార్యాలయాన్ని డిజైన్ చేశారు. గ్రౌండ్ ఎలోర్‌లో కాన్ఫరెన్స్ రూమ్, రెసెప్షన్ ఏరియా, కాంటిన్, 300 సీట్ల సామర్థ్యం కలిగిన ఆడిటోరియం ఏర్పాటు చేసారు. రెండో అంతస్తులో పార్టీ సెల్స్, సిబ్బందికి వసతి కల్పించారు. మూడో ఎలోర్ పార్టీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలకు కేటాయించారు. టాప్ ఫ్లోర్‌ను ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్)కు రిజర్వ్ చేశారు. ఢిల్లీ ఎంపీలు, రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జి నేతలకు రూములు కేటాయించారు. రూ.2.23 కోట్ల వ్యయంతో కొత్త కార్యాలయ నిర్మాణం జరిగింది.

# సరస్వతీ అలంకారంలో కనకదుర్గమ్మ

(మొదటి పేజీ తరువాయి)

పూర్తవుతుందని చెప్పారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయంలో కొలువు తీరిన శ్రీదుర్గమ్మ వారికి సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.అనంతరం దేవాలయం బయట సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో 1500 మంది భక్తులు భోజనం చేసే విధంగా అన్న ప్రసాద భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. 27 కోట్లతో 3 నెలల్లో ప్రసాదం తయారీ కేంద్ర పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే రూ.5.5 కోట్లతో ప్రధాన ఆలయం వద్ద పూజా మండపానికి సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టామని చంద్రబాబు నాయుడు వివరించారు. సతీసమేతంగా ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. చినరాజగోపురం వద్ద స్థానాచార్యులు శివ ప్రసాద్‌శర్మ సీఎంకు పరివేష్టం కట్టారు.

# గిన్నిస్ రికార్డు సాధించిన తెలంగాణ బతుకమ్మ

(మొదటి పేజీ తరువాయి)

సృష్టించింది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ఏర్పాటు చేశారు. ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. భారీ బతుకమ్మ చుట్టూ మహిళలు లయబద్ధంగా ఆడారు. మంత్రి సీతక్క బతుకమ్మపాట పాడి అలరించారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీల నాయకులు ఎమ్మెల్సీ ఎల్.రమణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న వాతావరణం చూస్తే.. గల్లీ ఎన్నికైనా, ఢిల్లీ ఎన్నికైనా బీఆర్ఎస్‌కు అనుకూలమే అన్న పరిస్థితి కనిపిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రజలకు తామిచ్చిన ఎన్నికల హామీలను మర్చిపోయారని కాంగ్రెస్ పార్టీ ఆడుకుంటుందని మండిపడ్డారు. ఆరు 'గ్యారెంటీల' పేరుతో కాంగ్రెస్ చేసిన గారడీని ప్రజలు ఇంకా మర్చిపోలేదని స్పష్టంచేశారు. సమాజంలోని రైతులు, మహిళలు, ఆటో డ్రైవర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, విద్యార్థులు, వివిధ సామాజిక వర్గాల వారు అందరికీ హామీలు ఇచ్చి, కాంగ్రెస్ ఘోరంగా మోసం చేసింది' అని కేటీఆర్ ఆరోపించారు. 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గ్యారెంటీ కార్డులతో చేసిన గారడీలను గుర్తుచేసేందుకు మేం 'బాకీ కార్డులను' తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి తీసుకుపోతే, అదే కాంగ్రెస్ పాలిట బ్రహ్మాస్త్రం అవుతుందన్నారు. హైదరాబాద్ నగరంలో ఒక్కటంటే ఒక్క ఫ్లైఓవర్ కూడా కట్టలేదని పేర్కొన్నారు. గత 22 నెలలుగా హైదరాబాద్ నగరంలో ఉన్న రోడ్లను కూడా ప్రభుత్వం నిర్వహించ లేకపోతున్నది' అని మండిపడ్డారు. హైదరాబాద్ నగరానికి మన హయాంలో చేసిన అభివృద్ధిని చూసి, మరోసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మనకు ఓటువేసి గెలిపిస్తారన్న నమ్మకం ఉన్నది. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సునామీలా విస్తరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన అభయహస్తం భస్మాసుర హస్తమని తేలిపోయిందని తెలిపారు. ఆ మేరకు ప్రజల నుంచి స్పందన వస్తుంది. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలన్న స్పష్టమైన ఆలోచన ప్రజల్లో కనిపిస్తున్నది. ఇది రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ప్రజల్లో ఉన్నది. కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టి, తిరిగి ప్రజల సంక్షేమ, అభివృద్ధి పాలన కోసం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం రావాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నదని స్పష్టమవుతోంది' అని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఎరువుల కోసం లైన్లలో నిలబడి కొట్లాడే పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు గ్రామాల్లో ఆగ్రహావేశాలతో ఉన్నారు. మహిళలకు ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ చేసిన మోసంపై ఆగ్రహం వ్యక్తమవుతుందని వివరించారు. నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇస్తామని చెప్పి వృద్ధులను మోసం చేసిందన్నారు. యువతకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యార్థులు, విద్యార్థినులకు స్కూటీలు అని చెప్పి మాటతప్పారా లేదా అని ప్రశ్నించారు?. తెలంగాణలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నడు' అని విమర్శించారు.

# స్థానికంలో కాషాయ జెండా ఎగురవేస్తాం : రాంచందర్‌రావు

**హైదరాబాద్, 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలస్యమైనా తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రపతి, గవర్నర్‌ల పేరిట కాలయాపన చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండేళ్లకే కాంగ్రెస్ మీద ప్రజలకు విరక్తి కలిగిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం మీద ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురువేస్తామని ధీమా వ్యక్తం చేశారు రాంచందర్ రావు తమ గెలుపునకు స్థానిక సంస్థల ఎన్నికలే నిదర్శనం కాబోతున్నాయని ఉద్ఘాటించారు. తమకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. తాను స్వయంగా ఇప్పటివరకు 23 జిల్లాల్లో యాత్రలు చేశానని తెలిపారు. ఇంకో నాలుగు జిల్లాల్లో యాత్ర చేయాల్సి ఉందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను తామే గెలువబోతున్నామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేక ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పూల పండుగను మహిళలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకొని, చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగిసే బతుకమ్మ సాంస్కృతిక సంప్రదాయం తెలంగాణకు ప్రత్యేకమని చెప్పారు. కష్టాలన్నీ తొలగి, ప్రతి ఇల్లూ సుఖసంతోషాలతో నిండేలా, ప్రకృతిమాత బతుకమ్మ దీవెనలు అందించాలని కేసీఆర్ ప్రార్థించారు.

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కమిషనర్‌రాణి కుముదిని ప్రకటించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని వివరాలు వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్ఈసీ తెలిపారు. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాణికుముదిని వివరించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది ఎన్నికల కమిషన్. ఇందుకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరిపామన్నారు ఎన్నికల అధికారులు. ఇక ఎన్నికల్లో భాగంగా 565 మండలాల్లో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు మొత్తం మూడు దశల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీమొదటి విడత ఎన్నికలు జగనున్నాయి. ఇక అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ రెండో దశ ఎన్నికలు జరగనుండగా.. అక్టోబర్ 31న మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 4న రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జగనున్నాయి. ఇక చివరగా నవంబర్ 8న మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. మొత్తంగా రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీనితో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే రాష్ట్రమంతటా ఎన్నికల సందడి మొదలవగా కొన్ని గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించబోవడం లేదని ఎస్ఈసీ ప్రకటించింది. కరీంనగర్, ములుగు జిల్లాల్లో 14 ఎంపీటీసీ, 27 గ్రామ పంచాయతీలకు 246 గ్రామ వార్డులు ఎన్నికలకు దూరంగా ఉండనున్నాయని స్పష్టం చేశారు. కోర్టు కేసుల కారణంగా ఇక్కడ ఎన్నికల నిర్వహణ సాధ్యం కావడం లేదని, హైకోర్టు ఆదేశాల మేరకు ఈ స్థానాల్లో ఎన్నికలు జరగబోవని తెలిపారు. ములుగు జిల్లాలోని 25 గ్రామ పంచాయతీలు, కరీంనగర్ జిల్లాలోని 2 పంచాయతీలకు ఎన్నికలు లేవని స్పష్టం చేశారు. **ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- తొలివిడత...** నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9, స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11, పరిశీలన: అక్టోబర్ 12, నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 15, ఎన్నికల తేదీ- అక్టోబర్ 23, ఓట్ల లెక్కింపు- నవంబర్ 11, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- రెండో విడత, నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13, స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15, పరిశీలన: అక్టోబర్ 16, నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 19, ఎన్నికల తేదీ- అక్టోబర్ 27, ఓట్ల లెక్కింపు- నవంబర్ 11, గ్రామ పంచాయతీ ఎన్నికలు- తొలి విడత, నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 17, స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 19, పరిశీలన: అక్టోబర్ 20, నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 23, ఎన్నికల తేదీ, ఫలితాలు- అక్టోబర్ 31, గ్రామ పంచాయతీ ఎన్నికలు-రెండో విడత, నామినేషన్ల స్వీకరణ- అక్టోబర్ 21, చివరి తేదీ: అక్టోబర్ 23, పరిశీలన: అక్టోబర్ 24, నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 27, ఎన్నికల తేదీ, ఫలితాలు- నవంబర్ 4, గ్రామ పంచాయతీ ఎన్నికలు-మూడో విడత, నామినేషన్ల స్వీకరణ- అక్టోబర్ 25, చివరి తేదీ: అక్టోబర్ 27, పరిశీలన: అక్టోబర్ 28, నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 31, ఎన్నికల తేదీ, ఫలితాలు- నవంబర్ 8

## నిండుకుండల్లా తెలంగాణలోని
# ప్రధాన ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 158 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 94,383 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 96,003 క్యూసెక్కులను బయటకు పంపుతున్నారు. 29.917 టీఎంసీల పూర్తి సామర్థ్యం గల ప్రాజెక్టులో ప్రస్తుతం 18.237 టీఎంసీల నీరు ఉంది. ఇక నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి కూడా భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. 39 గేట్లను ఎత్తివేసి 4,10,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 3,40,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. 1091 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి, ప్రస్తుతం 1083.30 అడుగుల వద్ద ఉంది. 80.5 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి, ప్రస్తుతం 54.623 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,50,244 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. అధికారులు 21 గేట్లను ఎత్తివేసి 1,51,144 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1401.22 అడుగుల వద్ద ఉంది. అలాగే, 17.802 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి ప్రస్తుతం 12.736 టీఎంసీల నీటి నిల్వ ఉంది. నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో ఇన్ ఎ÷-లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోని 26 గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 5,86,379 క్యూసెక్కుల నీరు వస్తుండగా అంతే మొత్తాన్ని బయటకు పంపుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 585.50 అడుగులకు చేరింది. భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 44.3 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

# గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బీఆర్ఎస్ పార్టీ తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, కానీ రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలకు తెలుసునని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనసులకు బాగా తెలుసు అని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చిందని ఆయన అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బీసీలకు 42? రిజర్వేషన్ కల్పించామన్నారు. ప్రజల కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బీఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదు అన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేకపోయారని డిప్యూటీ సీఎం విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిందన్నారు. యువతకు గ్రూప్ 1, గ్రూప్ 2 తో పాటు ఇప్పటికే 60,000 ఉద్యోగాలు, 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్, 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు.

# పైరసీతో నిర్మాతలకు కోట్లల్లో నష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. నాలుగు నెలలు కష్టపడి దర్యాప్తు చేశామని గుర్తుచేశారు. దేశంలో మొదటి సారి పైరసీ చేస్తున్న ఓ గ్యాంగ్‌ను పట్టుకున్నామని వెల్లడించారు. 2023లో భారత దేశంలోని చిత్ర పరిశ్రమ రూ. 22,400 కోట్లు పైరసీతో నష్టపోయిందని చెప్పుకొచ్చారు సీపీ సీవీ ఆనంద్. 2024లో తెలుగు చిత్ర పరిశ్రమ రూ. 3700 కోట్లు నష్టపోయిందని తెలిపారు. ఈ అంశాలన్నీ దృష్టిలో ఉంచుకుని సమగ్ర దర్యాప్తు చేశామని పేర్కొన్నారు. పైరసీ మూవీస్ వల్ల ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు కూడా ప్రేక్షకులు అలవాటు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఓ వెబ్‌సైట్, టెలిగ్రామ్ ద్వారా పైరసీ మూవీలు స్ట్రీమింగ్ చేస్తున్నారని వివరించారు. సర్వర్స్ హ్యాకింగ్‌తో పాటు క్యామ్ కార్డర్ ద్వారా నిందితులు సినిమాలను పైరసీ చేస్తున్నారని తెలిపారు. బెట్టింగ్ గేమింగ్ యాప్స్ నిర్వాహకులు పైరసీ చేసేవారికి డబ్బులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు సీపీ సీవీ ఆనంద్. బెట్టింగ్ యాప్ నిర్వాహకులు పైరసీ మూవీల ద్వారా వారి యాప్‌లను ప్రచారం చేసుకుంటున్నారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు అందుకున్న వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. తమిళ్ బ్లాస్టర్స్, ఫైవ్ మూవీ రూల్స్, తమిళ్ మూవీ వెబ్‌సైట్ లలో పైరసీ సినిమాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన జానా కిరణ్ కుమార్ అత్తాపూర్‌లోని మంత్ర మాల్ థియేటర్‌లో సినిమా కాపీ చేశాడు. ఫిర్యాదు అనంతరం 44 మంది అనుమానితులను విచారించిన తర్వాత అసలు నిందితుడు జానా కిరణ్ కుమార్‌గా తేలింది. చాలా సినిమాలని అత్తాపూర్‌లోని మంత్ర థియేటర్‌లో మొబైల్‌తో రికార్డ్ చేసి సిరిల్ అనే వ్యక్తికి అందచేశారు. నలబై మూవీలు థియేటర్‌లో కాపీ చేశాడు. ప్రతి సినిమాకు 300 నుంచి 400 డాలర్లను బిట్ కాయిన్స్ రూపంలో కిరణ్ కుమార్ తీసుకుంటున్నాడు. అనంతరం క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ ప్లాట్ ఫాంని ఉపయోగించి ఇండియన్ కరెన్సీలోకి మార్చుకుంటున్నారు. సినిమా పైరసీ చేయడానికి అనువైన సీటు చూసుకుని.. టికెట్ బుక్ చేసుకుని హై ఎండ్ కెమెరా ఉన్న ఫోన్‌తో రికార్డ్ చేస్తారు. స్క్రీన్ ఆఫ్ ఉన్నా కెమెరాల్లో వీడియో రికార్డ్ చేసే యాప్ ద్వారా అనుమానం రాకుండా ఇదంతా చేస్తున్నారు. అలాగే, బీహార్‌కు చెందిన అర్సలన్ అహ్మద్ కూడా హిందీ భోజ్‌పురి సినిమాలు రికార్డ్ చేసి సిరిల్‌కు పంపుతాడు' అని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# నగరంలో పేదలకు రూ.5కే అల్పాహారం

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కూడా పాల్గొన్నారు.ఈ పథకం కింద ఒక్కో అల్పాహారంపై జీహెచ్ఎంసీ రూ. 14, మధ్యాహ్న భోజనంపై రూ. 24.83 భరించనుంది. దీని వల్ల ఒక్కో వ్యక్తిపై నెలకు సుమారు రూ. 3,000 ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అల్పాహారం కోసం 'హరే రామ, హరే కృష్ణ' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సాధారణంగా రూ. 19 ఖర్చయ్యే టిఫిన్‌ను కేవలం రూ. 5కే, అలాగే రూ. 30 ఖర్చయ్యే భోజనాన్ని రూ. 5కే అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మొదటగా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా.. గత 10 సంవత్సరాలుగా లేని రేషన్ కార్డులు తమ ప్రభుత్వం అందించిందని, అలాగే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

# తన స్టాప్ వచ్చిసింది..ప్రయాణం కొనసాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులు దిగిపోతుంటారని.. కానీ రోడ్డు మాత్రం ఎప్పటికీ అలానే ముందుకు సాగుతుందని సజ్జనార్ ట్వీట్ చేశారు. బస్ పార్క్ చేసి.. సరికొత్త సవాల్ వైపు దూసుకెళ్లాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. టీజీఎస్‌ఆర్టీసీకి లైఫ్ లైన్ అయిన ఆర్టీసీ డ్రైవర్లకు, కండక్టర్లకు సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ సంస్థతో, ఉద్యోగులతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని ఆర్టీసీ ఎండీ సజ్జనర్ అన్నారు. నాలుగేళ్ల పాటు ఎండీగా పని చేశానని.. ఈ సమయంలో ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఆర్టీసీ ఎండీ నుంచి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బదిలీ అవుతున్న క్రమంలో.. ఆర్టీసీ అధికారులు బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళా భవన్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేశానని సజ్జనర్ అన్నారు. ఉద్యోగులపై దాడులు జరిగినప్పుడు, కఠినంగా వ్యవహరించమని పేర్కొన్నారు. సినీ నటుడు అల్లు అర్జున్ నటించిన ఓ యాడ్‌లో ఆర్టీసీ సంస్థను ప్రతిష్టను దిగజారిన విషయంలో లీగల్ నోటీసులు పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నాలుగేళ్ళ సమయంలో ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో సహాయ సహకారాలు అందించిన ఉద్యోగులకు సజ్జనర్ ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్నికల నిబంధనలను తప్పకుండా పాటించాలి

**రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమీషనర్**






**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్, జిల్లా కలెక్టర్ లతో సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో ఎంపిటిసి, జెడ్పిటిసి, గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని అన్నారు. రెండు విడతలలో స్థానిక సంస్థలను, 3 విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే ప్రాంతాలలో అమలులోకి రావడం జరుగుతుందని అన్నారు. ఎం.సి.సి. నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యలను చేపట్టే రిపోర్ట్ అందించాలని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా, ఎంసిసి నిబంధనలకు విరుద్ధంగా అర్బన్ ప్రాంతాలలో, సోషల్ మీడియా ద్వారా ఉల్లంఘనలు చేస్తే వారిపై ఎన్నికల కమీషన్ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో స్థానిక సంస్థలు రెండు విడతలలో, గ్రామ పంచాయతీ 3 విడుతలలో ఎన్నికలు జరగనున్నాయని కలెక్టర్ తెలిపారు. 183 గ్రామాలకు మొదటి దశలో, 196 గ్రామాలకు రెండవ దశలో, 192 గ్రామాలకు మూడో దశలో ఎన్నికలు జరుగుతాయని అన్నారు. 10 మండలాల చొప్పున రెండు దశలలో జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఎంసిసి నియమ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, సిబ్బందికి ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులతో మాట్లాడుతూ... ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎంసిసి నిబంధనల పక్కాగా అమలు కావాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు పూర్తిగా తొలగించాలని అన్నారు. ప్రతి మండలం పరిధిలో ఎఫ్.ఎస్.టి/ ఎస్.ఎస్.టి. టీములను ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు సందర్శించి అవసరమైన వసతులు ఉన్నాయో లేదో రిపోర్ట్ అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజూ రిపోర్ట్ లు సకాలంలో అందేలా మండల స్థాయిలో పటిష్ట వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో 6 డి.ఆర్.సి. లు ఏర్పాటు చేయాలని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత నామినేషన్, ఉప సంహరణ, స్క్రుటిని, గుర్తుల కేటాయింపు సరిగ్గా జరిగేలా ఎంపీడీవో మండలంలో బాధ్యతలు స్వీకరించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ రోజు చేయాల్సిన విధులను సంపూర్ణంగా తెలుసుకోవాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ఒక్క రీ-పోల్ జరగడానికి వీలు లేదని అన్నారు. ఎన్నికల శిక్షణా కార్యక్రమాలకు హాజరుకాని సిబ్బందికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ మండల అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలు ఎక్కడ అందుబాటులో ఉన్నాయి పరిశీలించాలని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుంచి చెక్ చేసే విధంగా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో వచ్చే ఫిర్యాదులను పరిశీలించేందుకు ప్రత్యేకంగా వ్యవస్థ మండల స్థాయిలో ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇకనుంచి ఎటువంటి సమావేశాలు నిర్వహించాలన్న తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, జిల్లా నోడల్ అధికారులు, ఎంపిడివో లు, ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ గౌస్‌పల్లి, కటాక్షపూర్ గ్రామాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు







**ములుగు సెప్టెంబర్ 29(పిసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా పరిధిలోని మహమ్మద్ గౌస్‌పల్లి, కటాక్షపూర్ గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు సాంప్రదాయ వేషధారణలో పాల్గొని బతుకమ్మలను ఆడిపాడుతూ, సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. జిల్లా నాయకుడు మేకల ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కటాక్షపూర్ అధికార ప్రతినిధి మహమ్మద్ గఫూర్, గ్రామ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, మహిళల ఏకతకు చిహ్నంగా ఈ వేడుకలు ప్రతి గ్రామంలో ఉత్సాహంగా నిర్వహించబడుతున్నాయని పేర్కొన్నారు. మహిళల ఉత్సాహం, సాంప్రదాయ వాతావరణం గ్రామాల్లో వేడుకలకు విశేష ఆకర్షణగా నిలిచాయి.

# ప్రతాప్‌నగర్‌లో నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం



**వరంగల్, సెప్టెంబర్ 29(పిసీడబ్ల్యూ న్యూస్):** జనయేత్రి ఫౌండేషన్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఈ రోజు 26వ డివిజన్ అధ్యక్షులు జన్ను జీవన్ మరియు కిరణ్ గార్ల సహకారంతో 19వ డివిజన్ ప్రతాప్‌నగర్‌లోని షెల్టర్ ఫర్ అర్బన్ హెూమ్‌లెస్‌లో 30 మంది నిరాశ్రయులకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ రహీమ్ ఖాన్ పాల్గొని మాట్లాడుతూ, "పట్టణ నిరుపేద నిరాశ్రయులకు అన్న వితరణ చేయడం అభినందనీయం. ఫౌండేషన్ చేస్తున్న నిస్వార్థ సామాజిక సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి సహకరిస్తే, మా సేవలను జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తాము" అని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సుధాకర్, తాహర్, అలాగే షెల్టర్ నిర్వాహకులు పాల్గొని ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గ్రూప్ - 1 డిఎస్‌పిగా ఎంపికైన మౌనికను అభినందించిన ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

- **కష్టపడితే ఫలితం వస్తుందనడానికి మౌనికే నిదర్శనం ఎస్పీ**
- **తెలంగాణ పోలీస్ కీర్తి ప్రతిష్టలు పెంపొందించేలా నడుచుకోవాలని సూచన**



**ములుగు సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈరోజు ఘనంగా జరిగిన కార్యక్రమంలో గ్రూప్-1 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి డి.ఎస్.పి.గా ఎంపికైన మల్లంపల్లి మండలానికి చెందిన మౌనిక నీ ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్.పి ఐపీఎస్ శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ శబరీష్ మాట్లాడుతూ కష్టపడితే తప్పక ఫలితం వస్తుంది. మౌనిక గారి విజయం ప్రతి యువకుడికి స్ఫూర్తి. తల్లి దండ్రుల మద్దతుతో, అచంచలమైన పట్టుదలతో సాధించిన ఈ విజయాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి" అని పేర్కొన్నారు. మౌనిక ఉద్యోగంలో కూడా అదే క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని, ప్రజల పట్ల సేవాభావంతో వ్యవహరించాలని సూచించారు. తెలంగాణ పోలీస్ దేశంలోనే ఉత్తమ పోలీసు వ్యవస్థగా పేరొందిందని, అందులో భాగమవుతున్న మౌనిక పోలీస్ వ్యవస్థ కీర్తి ప్రతిష్ఠలను మరింత పెంచాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్పీ మౌనిక తల్లిదండ్రులను కూడా అభినందిస్తూ, సంతానానికి విద్య అందించి, జీవితంలో స్థిరపడేలా చేసిన మీ కృషి ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్ర మంలో అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ ఐపీఎస్, డిసిఆర్బి డిఎస్పి కిషోర్ కుమార్, ములుగు డిఎస్పి రవీందర్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐ లు, మౌనిక కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# సద్దుల బతుకమ్మ సంబరాలు...

- **బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళలకు బహుమతులు అందజేత**






**నర్సంపేట, సెప్టెంబర్ 29 (పీసీ డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగకు విశేష స్థానం ఉంది. ఖానాపురం మండలంలోని గ్రామాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. అశోక్ నగర్ గ్రామంలో తొమ్మిది రోజుల పాటు రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి.. మహిళలు ఆనందోత్సవాల మధ్య పూజించి, ఆఖరి రోజున సద్దుల బతుకమ్మ ఆటపాటలతో డీజే సౌండ్ నృత్యాలతో పిల్లలు పెద్దలు ఘనంగా సంబరాలు జరుపుకొని పోయిరావమ్మా బతుకమ్మ మళ్ళీ రా బతుకమ్మ ,మా తల్లి బంగారు బతకమ్మ అని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అశోక్ నగర్ గ్రామంలోని బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ముచ్చ యాదగిరిరావు, గ్రామ పార్టీ ముఖ్యుల ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా కోల వినోద భర్త వెంకన్న, రెండవ బహుమతి బసన బోయిన మనిత భర్త మల్లయ్య, మూడవ బహుమతి జక్కుల భాగ్య భర్త వీరన్న, నాలుగోవ బహుమతి గుర్రం మల్లికాంబ భర్త సారయ్య లకు, అందంగా పేర్చిన బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. బిఆర్ఎస్ గ్రామ పార్టీ ముఖ్య నాయకులు, ఆటో యూనియన్ బిఆర్ఎస్ కార్యకర్తలు, తదితర సభ్యులు గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



# గుమాస్తా కార్మికులకు దసరా పండుగ బోనస్ ఇవ్వాలి



**హన్మకొండ, సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యు న్యూస్):** ఆల్ షాప్ గుమస్తాల సంఘం ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తా లో వెంకటేశ్వర్ల అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశంలో గుమాస్తాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏఐసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరంగల్ లో వివిధ షాపులలో పని చేస్తున్న గుమస్తా కార్మికులకు దసరా పండుగ సందర్భంగా ప్రస్తుతం ఇస్తున్న వేతనం మీద ఒక సంవత్సరం బోనస్ ఉచితంగా ఇవ్వాలని కోరారు. కొంతమంది యాజమాన్లు సానుకూలం గా స్పందిస్తూ బోనస్ ఇస్తామని కార్మికులకు హామీ ఇవ్వడం జరిగింది. గుమాస్తా సోదరీ, సోదరీ మణులు యాజమాని వద్ద పని చేస్తున్నారు గుమాస్తాలకు పని చేస్తున్నట్లుగా ఎలాంటి గుర్తింపు లేదు యాజమాను ల నుండి బోనస్ సర్వీస్ ఇతర బెనిఫిట్స్ మరియు ఈఎస్ఐపిఎఫ్ బోనస్ సర్వీసు ఎస్ ఫామ్స్ సౌకర్యము లు కల్పించడం లేదు రోజుకు 10 నుండి 12 గంటలు పని చేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు ఇస్తూ కార్మికుల చేత వెట్టి చాకిరి చేయించుకుంటున్నారనీ అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు పెరగడం మూలంగా ఇచ్చే జీతం సరిపోక కుటుంబాలను పోషించుకోలేక దుర్భరమైన జీవితాలు గడిస్తున్నారు జీతము పెంచమని అడిగితే ఉన్న జీతాన్ని తగ్గించి టార్గెట్లు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారు మహిళా కార్మిక సోదరులకు అతి తక్కువ వేతనాలు 5000/- నుండి 8000 రూపాయల వరకు ఇస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు జీతం పెంచమని అడిగితే పెంచకుండా ఇస్తున్న జీతాన్ని తగ్గిస్తూ నీ ఇష్టం ఉంటే ఉండు లేకుంటే వెళ్లిపొమ్మని యజమానులు ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికే కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ పెట్టుబడు దారులకు యాజమాన్లకు అనుకూలంగా చట్టాలు కార్మికులను నూతన బానిసత్వం లోకి నెట్టే ప్రయత్నం ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తుందన్నారు కార్మికుల హక్కులను కాపాడడం కోసం పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కే. రమేష్, జి. నరేందర్. శ్రీనివాసు, కుమారస్వామి సంతోష్, రమ, సుజాత వాణి, పుష్ప, పద్మ, సరిత అనిత, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

PCW తెలుగు దినపత్రిక



# "స్థానిక" సమరానికి బీజేపీ సై. ఢిల్లీలోనే కాదు. ఈసారి గల్లీ గల్లీలోనూ కాషాయ జెండా ఎగరేయబోతున్నాం

- కరీంనగర్, సిరిసిల్ల జడ్పీ పీఠాలను కైవసం చేసుకుని కొత్త చరిత్రను లిఖిస్తాం.
- ఐపీఎల్,ఆసియా కప్ భారత్ దే.
- రేపు జరగబోయే కేపీఎల్, ఎస్పీఎల్ కప్ కాషాయానిదే.
- పల్లెపల్లెనా కాంగ్రెస్ చేసిన మోసాలను ఎండగడతాం.
- బీఆర్ఎస్ పాపాలనూ ప్రజల ముందుంచుతాం.
- పల్లెలకు పైసలిస్తోంది కేంద్రమే.
- పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ లను గెలిపిస్తే ఊరు వల్లకాడే...
- స్థానిక నగారా నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు...







**కరీంనగర్,సెప్టెంబర్28(పీసీడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి బీజేపీ సిద్ధంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. "నాకు రాజకీయ జన్మనిచ్చిన కరీంనగర్ పార్లమెంట్ ప్రజల కోసం, కాషాయ జెండాను నమ్ముకున్న నా కార్యకర్తలను గెలిపించడం కోసం ఢిల్లీ ఎన్నికల్లోనే కాదు. గల్లీ ఎన్నికల్లోనూ కొట్లాడేందుకు నేను సిద్ధం. స్థానిక సమరంలో ఈసారి బీజేపీ కొత్త చరిత్రను లిఖించబోతోంది. కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలపై కాషాయ జెండా ఎగరేసి తీరుతాం" అని స్పష్టం చేశారు. ఆసియా కప్, ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లలో ఇండియా ఘన విజయం సాధించినట్లుగానే రేపు జరగబోయే కరీంనగర్ పల్లె లీగ్ (కేపీఎల్ లీగ్), సిరిసిల్ల పల్లె లీగ్ (ఎస్పీఎల్) స్థానిక పోటీల్లోనూ బీజేపీ అభ్యర్థుల గెలుపు తథ్యమన్నారు. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న నిఖార్సైన బీజేపీ కార్యకర్తలకే ఈసారి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో టిక్కెట్లు ఇస్తామని ప్రకటించారు. టిక్కెట్లు ఇవ్వడంతోపాటు గెలిపించుకుని కాషాయ కార్యకర్తల నుదుటిన విజయ తిలకం దిద్దుతామని తెలిపారు. ఈరోజు స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏమన్నారంటే.స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడాన్ని భారతీయ జనతా పార్టీ పక్షాన స్వాగతిస్తున్నాం. నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనా వైఫల్యాలవల్ల స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమైనయ్. గత బీఆర్ఎస్ పాలనలో పంచాయతీలకు నిధులివ్వకపోవడమే కాక అభివృద్ధి పేరుతో నాటి సర్పంచులు చేసిన పనులకు కూడా బిల్లులివ్వకుండా వేధించింది. కేంద్రం నుండి వచ్చిన నిధులను సైతం దారి మళ్లించింది. కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే రాష్ట్ర ప్రభుత్వం వద్ద పైసల్లేవంటూ స్థానిక సంస్థలకు నిధులివ్వకుండా ఈ పార్టీ చేతులెత్తేసింది. దేశ చరిత్రలో 22 నెలలుగా పంచాయతీలకు నయాపైసా విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది తెలంగాణ మాత్రమే. పంచాయతీ సిబ్బంది జీతాలివ్వడం లేదు. ట్రాక్టర్లకు డీజిల్ పైసలు కూడా ఇయ్యడం లేదు. పంచాయతీల్లో అంతో ఇంతో అభివృద్ధి చెందుతోందంటే ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వమే కారణం. ఏటా క్రమం తప్పకుండా పంచాయతీలకు ఠంచన్ గా నిధులను ఇస్తోంది కేంద్ర ప్రభుత్వమే. జాతీయ ఉపాధి హామీ పథకం మొదలు సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్(సీఆర్ఐఎఫ్), ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన దాకా ఈరోజు గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతో చేస్తున్నవే. స్థానిక సంస్థల పాలక మండళ్ల గడువు ముగిసి రెండేళ్లు కావొస్తున్నా కాంగ్రెస్ పాలకులు ఎన్నికలను నిర్వహించకపోవడంవల్ల రాజ్యాంగం ప్రకారం కేంద్రం నుండి వచ్చే నిధులు కూడా ఆగిపోయాయి. దీనికి ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే కారణం. కేంద్రం నుండి నిధులు ఆగిపోవడంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించి ఆ నిధులు తెచ్చుకోవాలనుకుంటున్నారే తప్ప స్థానిక ఎన్నికలు నిర్వహించి గ్రామాలను, మండలాలను అభివృద్ధి చేసుకుందామనే ఆసక్తి కాంగ్రెస్ పాలకులకు లేనే లేదు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ చేసిన మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఎండగడతాం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పల్లెపల్లెకూ వివరిస్తాం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ చేసిన పాపాలను సైతం వివరించి ప్రజల ముందు దోషులుగా నిలబెడతాం. పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మాయ మాటలు నమ్మి గెలిపిస్తే ఈసారి ఊరు వల్లకాడు అవుతుందనే వాస్తవాన్ని ప్రజల ముందుంచుతాం. అదే సమయంలో గ్రామ పంచాయతీలకు మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోపాటు ఆ నిధులవల్ల జరిగిన అభివృద్ధిని సైతం ఇంటింటికీ వివరిస్తాం. ఢిల్లీలోనే కాదు. ఈసారి జరగబోయే ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గల్లీ గల్లీలోనూ కాషాయ జెండా ఎగరేస్తాం. అత్యధిక మండల పరిషత్ పీఠాలతోపాటు కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ పీఠాలను సైతం కైవసం చేసి ఈ కొత్త చరిత్రను లిఖించబోతున్నాం. బీజేపీ పక్షాన నిలబడే అభ్యర్థులను ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు విజప్తి చేస్తున్నా. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలకు నేను చెప్పేదొక్కటే. ఈ ఎన్నికల్లో గెలిచే అవకాశమున్న నాయకులకు మాత్రమే టిక్కెట్లు ఇస్తాం. అభ్యర్థుల ఎంపిక కోసం ఇప్పటికే సర్వే టీంలు ఒక దఫా సర్వే పూర్తి చేశాయి. రిజర్వేషన్లు ఖరారైన నేపథ్యంలో నిన్నటి నుండి సర్వే టీంలు రంగంలోకి దిగాయి. అభ్యర్థుల ఎంపిక విషయంలో పైరవీలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తాం. గెలుపే గీటురాయిగా భావించి టిక్కెట్లు ఇస్తాం. పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేస్తున్న నాయకులు కొన్ని చోట్ల గెలిచే అవకాశం లేకపోయినా, రిజర్వేషన్ల మూలంగా టిక్కెట్లు రాకపోయినా నిరాశ చెందవద్దు. వారికి పార్టీలో, ఇతరత్రా పదవుల్లో సముచిత స్థానం కల్పించి గౌరవిస్తాం. అంతిమంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి అత్యధిక స్థానాలు సాధించి కాషాయ జెండా సత్తాను చాటాలని కోరుతున్నా.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం...

## • తిమ్మాపూర్ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరా చారి

**మానకొండూర్/తిమ్మాపూర్,సెప్టెంబర్28(పీసీడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా సోమవారం కొత్తపల్లిలో ఆశావహులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతీ గ్రామం నుండి బీజేపీ కి ఓట్లు సాధించిన విషయం కార్యకర్తలు మర్చిపోవద్దని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ద్వారానే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి అభివృద్ధి పనులపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి గెలిచే దిశగా వాడుకోవాలని సూచించారు. అధికారం లోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రశ్నించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత పాలన పై ప్రజలకు వివరించాలని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ



సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఎర్రోజు లక్ష్మణ్, అధికార ప్రతినిధి రాజు గౌడ్, కార్యవర్గ సభ్యులు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్,కిసాన్ మోర్చా నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్,మధుకర్ రెడ్డి,వేల్పుల ఓదయ్య, భూంరెడ్డి,మహేందర్ రెడ్డి,ప్రదీప్ రెడ్డి,దిలీప్,కుంభం శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, సుగుణాకర్, కోతి రాజు, దేవేందర్ రెడ్డి, కాల్వ మల్లేశం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వైద్య విద్యార్థిని కి సన్మానం చేసిన బీజేపీ నాయకులు.**



కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామక్రిష్ణకాలనీ గ్రామానికి చెందిన ఇనుకొండ స్వప్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో MBBS సీటు సాధించిన సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరా చారి నేత్రుత్వం లో నాయకులు సోమవారం సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఇతర రాష్ట్రాలలో సంచార జీవనం చేస్తూ కుటుంబాలను పోషించుకునే బేడ బుడిగె జంగం కులానికి చెందినటువంటి ఇనుకొండ రమేష్ –రాజేశ్వరి దంపతుల కూతురు మొదటి ప్రయత్నం లోనే వైద్య విద్య లో సీటు సాధించడం పై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీటు సాధించడం లో తల్లిదండ్రుల కృషి ఉందని అందుకే ప్రతీ తల్లిదండ్రులు బిడ్డల యొక్క అభివృద్ధి విషయం లో పట్టించుకోవాలని సూచించారు. వైద్య విద్య లో సీటు సాధించడం లో తనకు వెన్నంటి ఉండి సహకరించిన తల్లిదండ్రు లు,కుటుంబ సభ్యులకు పాదాభివందనం చేస్తున్నట్లు స్వప్న తెలిపారు. తనకు అభినందనలు తెలిపిన గ్రామస్తులకు భవిష్యత్ లో అండగా ఉంటానని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు రేగూరి సుగుణాకర్, వేల్పుల ఓదయ్య,ఎడ్ల భూంరెడ్డి, కోతి రాజు, కిన్నెర ముత్తిలింగం, ఇనుకొండ విట్టల్,కుటుంబ సభ్యులు ఇనుకొండ సంపత్, ఇనుకొండ నరేష్, రాజు తదితరులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గంగాధరలో తెలంగాణ సాంస్కృతిగా సాంప్రదాయాల వేడుక బతుకమ్మ సంబరాలు





**గంగాధర సెప్టెంబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ లో తిరక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటల గౌరమ్మను కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే పండుగ బతుకమ్మ. గంగాధర మండలం మధుర నగర్ లో వాడ వాడనా వీధి వీధినా తీరక్క పూలతో పెద్దగా బతుకమ్మ లను పేర్చి ఆటపాటలతో ఘనంగా బతుకమ్మను ఆడుకున్నారు. ఇట్టి కార్యక్రమానికి మండలంలోని మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు









## తెలంగాణ సాధించిన తర్వాతనే వైభవోపేతంగా బతుకమ్మ వేడుకలు

## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మా అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో పోరాడి సాధించుకున్న తెలంగాణలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గత వారం రోజులుగా బతుకమ్మ వేడుకలను జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ తాత మధుసూదన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ బతుకమ్మ వేడుకలకు వందలాదిగా మహిళలు, యువతులు, చిన్నారులు, పార్టీ కార్యకర్తలు భక్తి శ్రద్ధలతో పూలమాలలతో అలంకరించిన బతుకమ్మలను తీసుకువస్తూ ఆటపాటలతో, కోలాట నృత్యాలతో, డీజే డాన్సులతో తొమ్మిది రోజులుగా బతుకమ్మ పండుగలను ఘనంగా నిర్వహించారు. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, చివరి రోజు 'సద్దుల బతుకమ్మ' వేడుకతో



బతుకమ్మ సంబరాలు ముగియనున్నాయి. చివరి రోజు సోమవారం నాడు సద్దుల బతుకమ్మ వేడుకకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ బతుకమ్మ వేడుకలలో పాల్గొని ఆనందింప చేశారు. బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, బానోతు చంద్రావతి, తోట రామారావు, ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, బెల్లం ఉమా, వాసిరెడ్డి భారతీ, నాయకులు రావూరి శ్రీనివాస్ రావు, కరుమూరి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ లు పగడాల శ్రీవిద్య, శీలంశెట్టి వీరభద్రం, మహిళా నాయకురాలు ఉబ్బలపల్లి నిరోష, బుర్రి ఇందిరా వెంకట్, నాయకులు పగడాల నరేందర్, సద్దాం షేక్, మహమ్మద్ రఫీ, కోడిరెక్క ఫ్రాన్సిస్, కోడె బాబు, గురుమూర్తి, ధనియాకుల వీరస్వామి, నాగరాజు, నెమలి కిషోర్, నెమలికా వంశీ, షారుక్ అరఫత్, ఈధుల రాజేష్, ఆసిఫ్, బురాన్, దరిపెల్లి వీరబాబు, కుమారీ, రమాదేవి, కోటేష్, నాగేశ్వరరావు, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

# దమ్మాయిగూడ జర్నలిస్ట్ కాలనీలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, సెప్టెంబర్ 29,(పిసిడబ్ల్యూ న్యూస్):** దమ్మాయిగూడ జర్నలిస్ట్ కాలనీలో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కాలనీలోని మహిళలు చిన్న పెద్ద తేడా లేకుండా కాలనీ చౌరస్తాలో బతుకమ్మ పాటలు అనుగుణంగా నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు సునీత మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బతకమ్మ పండుగ ప్రతీక అని అన్నారు. రాష్ట్ర పండుగగా అధికారిక గుర్తింపు పొంది అంగరంగ వైభవంగా బతుకమ్మ పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరూర్ నగర్ లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు ఆనంద, సంతోషి, లత, సువర్ణ, లక్ష్మి, అరుణ, సరస్వతి, అనన్య, సహజ, రాధిక, దీక్షిత, సత్య, లక్ష్మి, భవిష్య, రేణుక, పల్లవి, శ్రావణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు పురస్కరించుకొని. సోమవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని దర్శించుకుని..ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే జిఎంఆర్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ సపాన దేవ్, పటాన్చెరు సిఐ వినాయక్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ లాలూ నాయక్, రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఒడ్డే ఓబన్న జీవితం ప్రజలందరికీ స్ఫూర్తిదాయకం

**రామచంద్రపురంలో ఘనంగా ఓబన్న విగ్రహం ఆవిష్కరణ**

**పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** భావి తరాలకు ఒడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు నియోజకవర్గం రామచంద్రపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటుకు ముందు స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తో కలిసి బ్రిటీష్ సేనలపైన విరోచిత పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి ఓబన్న అని కొనియాడారు. అతని త్యాగాలను భావితరాలకు అందించే లక్ష్యంతో విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

## ఇన్ఫెక్షన్ వల్ల కాలును కోల్పోయిన భవన నిర్మాణ కార్మికుడు బబ్లు

### కార్మికున్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేసిన కార్పొరేటర్ మెట్టు.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాయి రామ్ నగర్ కాలనీవాసి భవన నిర్మాణ కార్మికుడు బబ్లూ ఇన్ఫెక్షన్ వల్ల తన కాలును కోల్పోవడం జరిగింది.ఈ విషయము భవన నిర్మాణ సంఘ సభ్యులు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కి తెలియజేయగా వెంటనే స్పందించి బబ్లూ నివాసానికి వెళ్లి పరామర్శించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలు కోల్పోయినందుకు అధైర్యపడొద్దని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.బబ్లూ కు ఆర్థిక సహాయం నిమిత్తం భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు 20000 రూపాయలు అందజేయగా, కార్పొరేటర్ తన వంతు సహాయంగా 10000 వేల రూపాయల నగదును అందజేశారు .ఈ కార్యక్రమంలో BSP శంకర్, మేస్త్రి రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే జిఎంఆర్ అధ్వర్యంలో పటాన్చెరులో అంబరాన్ని అంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు



**భారీ సంఖ్యలో హాజరైన మహిళలు**

**సాకి చెరువు కట్టపైన వెల్లివిరిసిన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు**

**అలరించిన జానపద గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు**

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బిత్తిరి సత్తి**

**విజేతలకు నగదు బహుమతులు, పట్టు చీరల పంపిణీ**

**పటాన్చెరు ప్రజలకు ఎల్లప్పటికీ రుణపడి ఉంటాం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** సద్దుల బతుకమ్మ సంబరాలు పటాన్చెరులో అంబరాన్ని అంటాయి. పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్చెరు పట్టణంలోని సాకి చెరువు కట్టపై సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో వేలాదిమంది మహిళలు తమ బతుకమ్మలతో హాజరయ్యారు. ప్రముఖ జానపద, సంగీత గాయకుల ఆధ్వర్యంలోని బృంద సభ్యులు ఆలపించిన బతుకమ్మ గీతాలకు అనుగుణంగా మహిళలు బతుకమ్మ ఆడారు. బిత్తిరి సత్తి హాస్యం అందరినీ అలరించింది. సాయంత్రం ఐదు గంటల ప్రారంభమైన సంబరాలు రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ప్రకృతిని ప్రేమిస్తూ..పూలను పూజించే అరుదైన పండుగ బతుకమ్మ పండుగ అన్నారు. పటాన్చెరు నియోజకవర్గం నుండి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో పటాన్చెరు పట్టణ ప్రజల సహకారం, మద్దతు అత్యంత కీలకమన్నారు. పటాన్చెరు ప్రజలకు జీవితాంతం తమ కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు. గత 14 సంవత్సరాలుగా బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరి ఆనందంలో



పాలుపంచుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఉత్తమ బతుకమ్మల కు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి 20 వేల రూపాయలు, ద్వితీయ బహుమతి 15 వేల రూపాయలు, తృతీయ బహుమతి 10 వేల రూపాయలును విజేతలకు అందించారు. 10 మంది మహిళలకు పట్టు చీరలు అందచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డిలు కుమార్తె, కోడలు, మనుమరాల్లు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు.పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్ ఆధ్వర్యంలో సిఐలు వినాయక రెడ్డి, లాలూ నాయక్ లు బందోబస్తును ఏర్పాటు చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు నగార మోగిన వేలా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్స్,ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన స్టేట్ ఎన్నికల కమిషన్.**

**ఎలెక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుండి ఎన్నికల నియమావళికి లోబడి విధులు నిర్వహించాలి**

**జిల్లా పోలీసు అధికారులను అప్రమత్తం చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.**





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రావడంతో, ఎన్నికలు సజావుగా జరగడానికి కాలసిన అన్నిరకాల ముందస్తు ఏర్పాట్లను చేసుకోవాలని వివిధ జిల్లాలకు చెందిన కలెక్టర్స్, ఎస్పీలతో స్టేట్ ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ మాట్లాడుతూ జిల్లా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు ఎన్నికలు సజావుగా జరగడానికి కావలసిన అన్నిరకాల ముందస్తు ఏర్పాట్లను చేసుకోవాలని,గత ఎన్నికలలో చెడు నడత కలిగిన వారిని సత్:ప్రవర్తన కోరుతూ ముందస్తుగా బౌండ్ ఓవర్ చేయాలని అధికారులకు సూచించడం జరిగింది. యస్.హెచ్.ఓ.లు తమ ఏరియాలో గల పోలింగ్ స్టేషన్స్, పోలింగ్ లోకేషన్స్ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ ను తప్పనిసరిగా సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకొని ఉండాలని, పోలింగ్ కేంద్రాలలో ఉండవలసిన కనీస వసతుల గురించి, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులతో సమన్వయం చేసుకొని ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేయాలని అన్నారు.రాష్ట్ర సరిహద్దుల నుండి ఎన్నికలను ప్రభావితం చేసే ఏ ఇతరములు అక్రమ రవాణా జరగడానికి విలులేదని, అంతర్ రాష్ట్రా, అంతర్ జిల్లా సరిహద్దు చెక్ పోస్తలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించడం జరిగింది. సోషల్ మీడియా వేదికగా ఎన్నికలను ప్రభావితం చేసే, పార్టీలను గాని, వ్యక్తులను గాని కించపరిచేలా వ్యాకయ్యలు చేసిన, పోస్టులు పెట్టిన సంబంధిత వ్యక్తులపై, గ్రూప్ అడ్మిన్ లపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.అధికారులు సిబ్బంది తమ పోలీస్ స్టేషన్ హెడ్ క్వార్టర్స్ లలో ఉండాలని,ఏ చిన్న సంఘంటన జరిగిన త్వరితగతిన స్పందించాలని ఎస్పీ ఆదేశించారు.


## శ్రీ మహంకాళి సేవా సమితి సభ్యులను సన్మానించిన మాదిరి ప్రిథ్వీరాజ్








**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించబడే శ్రీ మహంకాళి సేవా సమితి ఆధ్వర్యంలోని శ్రీదేవి శరన్నవరాత్రి నవరాత్రి ఉత్సవాలు ఈసారి కూడా భక్తి శ్రద్ధలతో, సాంస్కృతిక వైభవంతో సుసంపన్నంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాదిరి పృథ్వీరాజ్ సేవా సమితి సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు, అనంతరం మాదిరి పృథ్వీరాజ్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలు మాత్రమే కాకుండా, మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగలు. ప్రతిరోజూ చిన్నారులతో పాటు యువత, మహిళలు పాల్గొని కూచిపూడి, సంగీతం, నృత్యాలతో ఈ వేడుకలను మరింత శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ విశిష్టమైన వేదిక ద్వారా సమాజంలో ఐక్యత, భక్తి, సాంస్కృతిక విలువలు పటిష్టం అవుతున్నాయి. ఈ పుణ్యకార్యానికి శ్రీ మహంకాళి సేవా సమితి గౌరవాధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ సఫాన్నదేవ్, వారి అంకితభావంతో పనిచేస్తున్న బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు అందించిన ఈ వారసత్వాన్ని తప్పకుండా కొనసాగిస్తూ, భవిష్యత్తు తరాలకు అందిస్తాం” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్ రావు, టప్ప కుమార్, ఎట్టయ్య, ఫైర్ నరసింహారెడ్డి, బుచ్చయ్య, మల్కయ్య, కృష్ణ తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.




## దుర్గుణాలను పారద్రోలి సద్గుణాలను ప్రసాదించేది అమ్మవారు

**పతంజలి యోగా సెంటర్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు**

**సరస్వతీ దేవి అమ్మవారుగా దివ్య దర్శనం**

**సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**మహిళా మణులతో బతుకమ్మ ఆట ఆడి అందరినీ ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** అమ్మలగన్నా అమ్మ ఆది పరాశక్తి జగన్మాత మనుషులలోని దుర్గుణాలను పారద్రోలి సద్గుణాలను ప్రసాదించే అందరి కల్పవల్లి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పతంజలి యోగ సెంటర్లో నిర్వహింపబడుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈరోజు సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తున్న సాయం సంధ్యా వేళ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పురోహితుల తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలు అందుకున్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి కండువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకి అయిన అమ్మవారు అందరి కోరికలు ఈడేర్చి నెరవేర్చే అందరి కల్పవల్లి నియమ నిష్ఠలతో శ్రద్ధాసక్తులతో పూజిస్తే కోరిన వరాలను ఇస్తుందని, శక్తికి ప్రతీక అయిన అమ్మవారు తన అమూల్యమైన శక్తితో మనిషిలోని దుర్గుణాలను పారద్రోలి సద్గుణాలను ప్రసాదిస్తుందని, మనిషి లోపల సద్గుణాలు ఉన్నప్పుడే ఉన్నత వంతుడు అవుతాడని, అమ్మవారి దయవలన అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.**బతుకమ్మ ఆడి అందరిలో ఉత్సాహం నింపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్** తీరొక్క పూలతో గౌరమ్మ దేవికి మొక్కులు సమర్పించి పూలను పేర్చి అమ్మవారిని ఆరాధించే పూల పండుగ మన బతుకమ్మ పండుగ అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పతంజలి యోగ సెంటర్లో బతుకమ్మ పండుగ సంబరాలలో పాల్గొని మహిళా మణులు అందరితో కలిసి బతుకమ్మ ఆడి అందరిని ఉత్సాహపరచగా, ఎమ్మెల్యే బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొని తమతోపాటే బతుకమ్మ ఆడినందుకు కాలనీ మహిళలందరూ హర్షతిరేకంతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొని అడుగులు వేయగానే బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ నాయకులు అగ్గనూరి బస్వం, మైనార్టీ నాయకులు మొహమ్మద్ ఇబ్రహీం, సర్వర్ పాషా, ముబారక్ అలీ ఖాన్, బాలగంగాధర్ తిలక్ లతోపాటు దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో కాలనీ మహిళలు, అమ్మవారి భక్త మహాశయులు పాల్గొన్నారు.



# ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

**- మండల ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు: ఎస్ఐ గండ్ర సంతోష్**




**మహబూబాద్ జిల్లా సిరోలు సెప్టెంబర్ 29(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలంలోని మహిళలు సద్దుల బతుకమ్మ పండగను భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆటపాటలు ఆడుతూ గౌరమ్మ కొలుచుకునే ఆడపడుచులను మద్యం మత్తులో వారికి ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని సిరోలు ఎస్ఐ సంతోష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సద్దుల బతుకమ్మ,దసరా పండగ జరుపుకునే మహిళలను మద్యం మత్తులో ఆకతాయిలు ఆటంకాలు కలిగిస్తే వారిపై చర్యలు పకడ్బందీగా ఉంటాయని ఎస్పీ ఆదేశించారు. కావున పండుగను పండుగలాగా జరుపుకోవాలని యువకులకు మద్యం మత్తులోని బైకు రేసింగ్ తో మహిళలపై దూసుకెళ్తూ ఆకతాయి అల్లర్లు చేస్తే వెంటనే 100 కాల్ చేయాలి అని మహిళలను కోరారు. మీరు చేసిన ఫోన్ కాల్ వెంటనే పోలీస్ సిబ్బంది మీకు రక్షణ కల్పిస్తుందని అన్నారు.మండల ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా పండగ శుభాకాంక్షలు తెలిపిన్నారు.

# 'బతుకమ్మ' తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపం

**- ఖమ్మం రీజినల్ డిప్యూటీ మేనేజర్ మల్లయ్య**





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం 'బతుకమ్మ' అని ఖమ్మం రీజినల్ డిప్యూటీ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం రిజినల్ పర్సనల్ ఆఫీసర్ సంపత్, ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ లు అన్నారు. తొమ్మిదవ రోజు సోమవారం టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం నూతన బస్టాండ్ లో సద్దుల బతుకమ్మ వేడుకలు వారు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మహిళలతో కలిసి మెలసి బతుకమ్మ ఆడి వారిని ఉత్తేజపరిచారు. తొమ్మిది రోజుల పాటు గౌరమ్మను కొలుచుకొంటూ మహిళలు బతుకమ్మలు పేర్చి ఆడుతూ, పాడుతూ సంతోష వాతావరణంలో సద్దుల బతుకమ్మ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్టాండ్ కంట్రోలర్స్ ఎం. ఆర్ నాథ్, సిహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


# ఔదార్యాన్ని చాటుకున్న హన్మకొండ పోలీసులు

**హన్మకొండ సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యు న్యూస్):** ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరిన ఏడాది వయస్సు గల చిన్నారిని సకాలంలో ఆసుపత్రికి తరలించిన హన్మకొండ పోలీసులు ఔదార్యాన్ని చాటుకున్నారు. పద్మాక్షి గుట్ట వద్ద సద్దుల బతుకమ్మ వేడుకల్లో భారీగా జన సందోహం కావడంతో ఓ చిన్నారి ఫిట్స్ వచ్చి అస్వస్థకు గురి కావడంతో అక్కడే విధుల్లో ఉన్న ఎస్సై కిషోర్, కానిస్టేబుల్ రమణాకర్ స్పందించి చిన్నారిని ప్రథమ చికిత్స చేసి తమ బైక్‌పై సమీపంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.




# ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

**● ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్**





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన గొర్ల ముత్తారెడ్డి, గ్రామ కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా తమ స్థలంలో అక్రమంగా కాలువ తవ్వారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపిడిఓ కు రాస్తూ తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం మమత రోడ్డుకు చెందిన సాంబశివరావు, తనకు స్వాతంత్ర సమరయోధుల పెన్షన్ వస్తున్నదని, తనకు ప్రభుత్వ ఇండ్ల స్థలం లేదా వ్యవసాయ భూమి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరం ఎస్.ఆర్. అండ్ బి.జి.ఎన్.ఆర్. కళాశాల మైదానం నందు దీపావళి షాపులు ఏర్పాటు చేయటకు అనుమతి ఇప్పించాలని కోరుతూ వ్యాపారస్థులు దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డి విభాగం పర్యవేక్షకులకు రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. ఇట్టి ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ , జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


# స్థానిక సంస్థల రిజర్వేషన్లలో లంబాడీలకు తీరని అన్యాయం

**లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి "తేజావత్ వాసు నాయక్"**



**నర్సంపేట సెప్టెంబర్ 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** నర్సంపేట పట్టణంలో ని లంబాడి హక్కుల పోరాట సమితి సభ్యుల సమావేశంలో తేజావత్ వాసు నాయక్ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ లంబాడీలు రాజకీయంగా విద్యా ఉద్యోగ వైద్య పరంగా ఎదగాలంటే రిజర్వేషన్లు చాలా అవసరం జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ ప్రక్రియ జరగలేదు అందువలన గ్రామపంచాయతీలలో తండా పంచాయతీలలో ఎంపీటీసీ జెడ్పిటిసి లలో ఘోరమైన అవమానం జరిగింది జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలి తప్ప రొటేషన్ పద్ధతిలో చేయడం వలన మాకు అన్యాయం జరిగింది. భారత రాజ్యాంగంలో ఐదు ఆరు షెడ్యూల్లో క్లియర్ గా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సూచించాడు దాని ప్రకారం రాజకీయాలలో రిజర్వేషన్ ప్రక్రియ గిరిజనులకు విరుద్ధంగా కనపడతా ఉంది. అందుకని ఈ రాష్ట్రంలో ఏ ఎన్నికల్లో నిర్వహించిన జనాభా ప్రాతిపదికన మాత్రమే నిర్వహించాలని ఎలక్షన్ కమిషన్ డిమాండ్ చేస్తున్నారు. ఈసారి గిరిజనులు లంబాడీలు అనుకున్న ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్ అమలు కాకపోవడం రాజకీయంగా బలమైన దెబ్బ తగిలిందని భావిస్తున్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలలో లంబాడి రాజకీయ ఆశాభహులు అన్ని స్థానాలలో పోటీ చేయాలని రాజకీయంగా ముందుకు పోవాలని ధైర్యంగా ఎన్నికలలో పాల్గొనాలని లంబడి సమాజానికి పిలుపునిస్తున్నాం ఈ సమావేశంలో భూక్యా జగన్ నాయక్,గుగులోతు బాలు నాయక్,గుగులోతు కిషన్ నాయక్,గుగులోతు సుమన్ నాయక్, దారావత్ సుభాష్ నాయక్,దారావత్ భోజ్య నాయక్,బోడ హట్య నాయక్ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు పగడ్బందీగా ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 29(పి.సి.డబ్ల్యూ న్యూస్):** జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్, ప్రభుత్వ ఆదేశాలు నిబంధనల ప్రకారం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో ఎంపీటీసీ (193), జడ్పిటిసి(18) స్థానాలకు ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఆర్వోలు (22) అసిస్టెంట్ ఆర్వోలు (22) లను నియమించి ఇప్పటికే శిక్షణ పూర్తి చేయడం జరిగిందని, ఎంపిటిసి జడ్పిటిసి పోలింగ్ కేంద్రాలు (1066), ప్రభుత్వ గెజిట్ ప్రకారం రెండు దఫాలుగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.హైదరాబాదు నుండి స్టేట్ ఎలక్షన్ కమిషన్ అన్ని జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు,(482)గ్రామపంచాయతీ లకు సంబంధించిన సర్పంచ్ ఎన్నికలు జిల్లాలో మూడు దఫాలుగా నిర్వహించనున్నట్లు అందుకోసం (182) మంది ఆర్వోలు, అసిస్టెంట్ ఆర్వోలు (578) మందిని నియమించి, పోలింగ్ కేంద్రాలు (4110) ద్వారా ఎన్నికలు నిర్వహించడం కోసం సిద్ధంగా ఉన్నామని, ఎన్నికల నియమావళి అనుసరించి జిల్లా స్థాయి అధికారులు అందరిని నోడల్ అధికారులుగా నియమించి ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల నియమావళి పక్కగా అమలు చేయడం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు,ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ కె. అనిల్ కుమార్, జెడ్పి సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, సంబంధిత అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుపై అవగాహన


**పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థ ఏర్పాటుపై అవగాహన కల్గి ఉండి అర్హత కలిగిన గృహ వినియోగదారులు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి అధికారులతో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బీజిలి యోజనపై సమీక్ష నిర్వహించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బీజిలి యోజన పథకం, సేవా పర్వ్ పై సంపూర్ణ వివరాలను తెలంగాణ నార్త్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎస్ఈ శ్రీనివాస చారి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనపథకం ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పర్వ్ పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ఇంటిపై కప్పుపై సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే ఇంటి యజమానులకు విద్యుత్ ఖర్చు తగ్గడంతో భారీ ప్రయోజనం కలుగుతుందని, అర్హత ఉన్న కుటుంబాలు www.pmsuryaghar.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఈ పథకం ముఖ్య పాత్ర పోషిస్తుందని, ఇంటిపై 1 కిలో వాట్ సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు 30 వేల రూపాయలు, 2 కిలో వాట్ ఏర్పాటు 60 వేల రూపాయలు, 3 కిలో వాట్ ఏర్పాటు 78 వేల రూపాయలు సబ్సిడీ వస్తుందని, మిగిలిన నిధులు బ్యాంకు లోన్ ద్వారా సమకూర్చుకోవచ్చని అన్నారు. ఆసక్తి గల ప్రజలు ముందస్తుగానే తమ ఇండ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కోరారు. సొంత ఇల్లు ఉన్న అధికారులు వెంటనే తమ ఇంటిపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవాలని, ఈ పథకం గురించి ఇతర వివరాల కోసం టి.జి. ఎన్.పి.డి.సి.ఎల్. హెల్ప్ లైన్ 1912 కు, ఇంకా సంబంధిత ఏఈ/డీఈ కార్యాలయాలను సంప్రదించాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ , జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

**స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి అధికారులతో గ్రీవెన్స్ అనంతరం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమీషన్ షెడ్యూల్ విడుదల చేసినట్లు తెలిపారు. ప్రతి శాఖ ఎన్నికల కమీషన్ ఆధ్వర్యంలో పనిచేసి ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాలని అన్నారు. ఎంపిటిసి, జెడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో మండల ప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. వానాకాలం ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ సిద్ధం చేయాలని, గతంలో వచ్చిన ఇబ్బందులు పునరావృతం కాకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీ గడువు లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. క్రాప్ బుకింగ్ 50 శాతం మాత్రమే జరిగిందని, వ్యవసాయ విస్తరణ అధికారి తన పరిధిలో సాగు అవుతున్న పంట విస్తీర్ణం వివరాలు సేకరించి అక్టోబర్ 5 లోపు క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ మార్కెట్‌ను వెంటనే పూర్తి చేయాలి: సిపిఐ (ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్






**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మంలో నూతనంగా నిర్మిస్తున్న మోడల్ మార్కెట్ ను వెంటనే పూర్తి చేయాలని సిపిఐ (ఎం) ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ కోరారు. ఈ మేరకు సోమవారం కార్మిక, కర్షక, వ్యాపార సంఘాల ఆధ్వర్యంలో మార్కెట్ సెక్రటరీ, ఛైర్మన్ లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ను మోడల్ మార్కెట్గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చారని, 18 నెలల్లో రెండు విడతలుగా ఆధునీకరణ పూర్తి చేస్తామని ప్రభుత్వం చెప్పిందని తెలిపారు. కానీ ఇప్పటివరకు మార్కెట్లో ఒక్క షెడ్డు కూడా నిర్మాణం కాకపోవడంతో మార్కెట్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్ అతి దగ్గరలో ఉన్నందున పనులు పూర్తి కాకపోవటంతో రైతులు, వ్యాపారస్తులు, కార్మికులు బాగా ఇబ్బంది పడుతున్నారన్నారు. పనులు తొందరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు వజినేపల్లి శ్రీను, ఎర్ర గోపి, ఎల్లంపల్లి వెంకట్రావు, త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీను, నాయకులు పత్తిపాక నాగ సులోచన, ఎస్.కె ఇమామ్, ఎస్ కే సైదులు, ఎర్ర రంజిత్, వ్యాపార వర్గాల నాయకులు బండారు వీరబాబు, రమణారెడ్డి, ఎస్ సుధీర్, మేడ బోయిన లింగయ్య, పగడాల మోహన్ రావు, రావుల శ్రీను, బండి నవీన్, మెటికల ఈశ్వర్, సురేష్, పోతురాజు జార్జి, బండ్లమూడి వెంకటేశ్వరరావు, కార్మిక సంఘ నాయకులు మద్దిసత్యం, హెచ్ పీరయ్య, యర్రా మల్లిఖార్జున్, రమేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శంగా జలగం నగర్ ప్రభుత్వ పాఠశాల: మంత్రి పొంగులేటి

**జెడ్.పి.హెచ్.ఎస్. పాఠశాలకు 2 కోట్లు మంజూరు చేసిన ఈనాడు సంస్థకు ధన్యవాదాలు**

**ఏదులాపురం మున్సిపాలిటీలో ఈనాడు ద్వారా నిర్మిస్తున్న జలగం నగర్ జెడ్పీహెచ్. ఎస్. పాఠశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**









**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆదర్శంగా జలగం నగర్ ప్రభుత్వ పాఠశాలను తయారు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మున్నేరు వరదలతో పాడైన పాఠశాల భవనం స్థానంలో రూ. 2 కోట్ల అంచనా వ్యయంతో ఈనాడు సహాయ నిధి ఆధ్వర్యంలో నిర్మించనున్న కొత్త పాఠశాల భవనానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, ఈనాడు పత్రిక స్టేట్ బ్యూరో ఎం.ఎల్. నర్సింహారెడ్డి లతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... కనీవినీ ఎరుగని వరద గత సంవత్సరం మన ప్రాంతాన్ని దెబ్బతీసిందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల ప్రాణాల కాపాడు కున్నామని అన్నారు. జలగం నగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వరదలలో పూర్తి స్థాయిలో మునిగి పోయిందని, ఈ కష్టాలను ప్రత్యక్షంగా చూసి చలించిపోయిన ఈనాడు సంస్థ 2 కోట్ల రూపాయలతో పాఠశాల నిర్మిస్తున్నదని అన్నారు. జలగం నగర్ పాఠశాల నిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేసినందుకు ఈనాడు సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వ్యాపారం కోసం తాపత్రయ పడకుండా విలువలతో ఈనాడు సంస్థ పని చేస్తున్నదని, విపత్తుల సమయంలో దేశ వ్యాప్తంగా ముందుండి తమ వంతు సహాయం అందిస్తున్నదని మంత్రి తెలిపారు. రామోజీరావు ఆలోచనల మేరకు ఈనాడు సంస్థను నడుపుతున్న సభ్యులకు మంత్రి మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. ప్రజల హృదయాలలో ఈనాడు పేపర్ కు, రాత్రి 9.00 గంటల ఈటివి న్యూస్ చిరస్థాయిగా నిలిచిపోయిందని, నమ్మకానికి మారు పేరుగా ఈనాడు సంస్థ పని చేస్తున్నదని అన్నారు. తెలుగు రాష్ట్రాలలో జర్నలిజానికి బెంచ్ మార్క్ గా ఈనాడు సంస్థ పేరు సాధించిందని అన్నారు. పాఠశాల నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ... వరదలతో దెబ్బతిన్న పాఠశాలను రెండు కోట్ల రూపాయలతో నిర్మించేందుకు ఈనాడు సంస్థ ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వ తరపున ఈనాడు సంస్థకు సంపూర్ణ మద్దతు అందిస్తామని ఎంపీ తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. గత సంవత్సరం వచ్చిన అనూహ్యమైన వరదల కారణంగా పాఠశాల దెబ్బతిని విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు గమనించి ఈనాడు యాజమాన్యం 2 కోట్ల రూపాయలతో పునః నిర్మించేందుకు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. మంత్రి సూచనల మేరకు ఈనాడు యాజమాన్యానికి స్కూల్ నిర్మాణానికి భూమి కేటాయించామని, జలగం నగర్, నాయుడుపేట, పెద్ద తండా చుట్టుపక్క ప్రాంతాల ప్రజలకు ఈ పాఠశాల చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈనాడు సంస్థ నిర్మించే పాఠశాలతో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని కలెక్టర్ హెడ్ మాస్టర్ కు సూచించారు. స్థానిక మున్సిపల్ కమీషనర్, హెడ్ మాస్టర్ పాఠశాల నిర్మాణం త్వరగా జరిగేలా ఈనాడు యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించాలని అన్నారు. పాఠశాల నిర్మాణంతో పాటు త్రాగునీటి సరఫరా, ఫర్నిచర్, కంప్యూటర్ ల్యాబ్, సానిటేషన్ పైప్ లైన్ మొదలగు సంపూర్ణ వసతుల సౌకర్యం కోసం కూడా ఈనాడు యాజమాన్యం సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మున్సిపల్ కమీషనర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, మండల విద్యాధికారులు శ్యామ్సన్, శ్రీనివాసరావు, ఈనాడు ప్రతినిధులు, హెడ్ మాస్టర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు








**ములుగు జిల్లా,సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరు నాగారం: మండలంలో సోమవారం జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత ఉత్సాహంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహి ంచబడ్డాయి. మండలంలోని పలు గ్రామాల్లో బొడ్రాయిలు, ఆలయాలు విద్యుత్ కాంతులతో నింగినాటి చందమామలా మెరిశాయి. సాయంత్రం నుంచి మహిళలు, యువతులు సంప్రదాయ వేషధారణలో బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. డప్పులు, సన్నాయి, డీజే beats మేళాలతో పల్లె వీధులన్నీ ఉత్సవ శబ్దాలతో మార్మోగిపోయాయి. మహిళలు కోలాటాలతో, పాటలతో బతుకమ్మ ఆడుతూ పండుగ శోభను రెట్టింపు చేశారు. ఈ వేడుకల ద్వారా మహిళల ఐక్యత, భక్తి, సాంప్రదాయం పట్ల గౌరవం ప్రతిఫలించాయి. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

# అమల్లోకి ఎన్నికల కోడ్.. తనిఖీలు షురూ...

**మీ వద్ద అంతకు మించి ఒక్క రూపాయి ఎక్కువ ఉన్నా సీజ్..!**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ పల్లెల్లో ఎన్నికల జాతర ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేశారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో మొత్తం ఐదు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచే ప్రారంభమవుతుంది. మ్తొత్తం ఐదు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రక్రియ నవంబర్ 11తో ముగుస్తుంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఆంక్షలు ఉంటాయి. ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు రవాణా అరికట్టేందుకు అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తారు. సోమవారం నుంచి ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఒక సామాన్య వ్యక్తి రూ. 50 వేల వరకు మాత్రమే నగదు తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది. ఎన్నికల కమిషన్ సూచించిన దానికంటే ఒక్క రూపాయి ఎక్కువ ఉన్నా, సరైన పత్రాలు లేకపోతే ఆ నగదును అధికారులు సీజ్ చేస్తారు. ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే.. ఎన్నికల అధికారులు ఐటీ, జీఎస్టీ అధికారులకు సమాచారం అందించి ఆ డబ్బును కోర్టులో జమ చేస్తారు. తక్కువ మొత్తంలో దొరికిన డబ్బును రెవెన్యూ అధికారుల వద్ద జమ చేస్తారు. ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని, అనవసర ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నగదుకు సంబంధించిన తగిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. **సరైన పత్రాలు ఉంటేనే అనుమతి** అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు వంటి ముఖ్యమైన అవసరాలకు పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు తప్పనిసరిగా సరైన ఆధారాలు వెంట ఉంచుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ పత్రాలను చూపించగలిగితే.. జప్తు చేసిన డబ్బును తిరిగి ఇస్తారు. **అధికారులకు చూపించాల్సిన ఆధారాలు** బ్యాంకు లావాదేవీల్లో నగదు డ్రా చేసిన అకౌంట్ పుస్తకం లేదా ఏటీఎం చీటి... వ్యాపార లావాదేవీల్లో వస్తువులు లేదా ధాన్యం విక్రయించిన డబ్బు అయితే దానికి సంబంధించిన బిల్లులు..ఆస్తి లావాదేవీల్లో భూమి విక్రయించిన సొమ్ము అయితే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు.. వ్యాపారం లేదా సేవల ద్వారా వచ్చిన డబ్బు అయితే లావాదేవీల పూర్తి వివరాలు సమర్పించాలి.

# చిలుక్కోయలపాడులో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**● సల్లంగా చూడు సద్దుల బతుకమ్మ**





**మహబూబాబాద్, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** సీరోల్ మండలం చిలుకోయాలపాడు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దల చొరవతో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. **బతుకమ్మ విశిష్టత** బతుకమ్మ పండుగను తెలంగాణ రాష్ట్రంలో భాద్రపదమాసం అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ బతుకమ్మ పండుగను గౌరమ్మ పండుగ అని కూడా పిలుస్తారు తెలంగాణ ఆడపడుచులకు ప్రతీక అయిన పండుగ బతుకమ్మ పండుగ. ఈ పండుగ ప్రకృతిలోనే ప్రతి ఒక్క పువ్వులను పూజించే పండుగ పిలుస్తారు. బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే జరుపుకుంటారు. మొదటి రోజు ఎంగిలిపూలు బతుకమ్మ గా రెండో రోజు అటుకుల బతుకమ్మ, మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదోవ రోజు వెన్నెముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. ఇలా తొమ్మిది రోజులు తిరోక నైవేద్యాలతో అమ్మవారిని పూజించి చివరగా సద్దుల బతుకమ్మ రోజు అమ్మవారిని ఊరి శివారు చెరువులో నిమజ్జనం చేస్తారు. అదే రీతిలో చిలుక్కోయలపాడు గ్రామంలో కూడా బతుకమ్మను డీజే ఆటపాటలతో కోలాటాలతో చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకుని సాగనంపడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బతుకమ్మ కుంటను కబ్జాదారుల నుండి కాపాడిన కాంగ్రెస్ ప్రభుత్వం: తోలుపు నూరి కృష్ణ గౌడ్

**అంబర్ పేట సెప్టెంబర్ 29(పిసిడబ్ల్యూ న్యూస్):** బతుకమ్మ కుంట ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన డిసిసి ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపు నూరి కృష్ణ గౌడ్, ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ ముఖ్యమంత్రి అంబర్ పేట నియోజకవర్గం ప్రజలకు దసరా కానుకగా బతుకమ్మ కుంటను ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ మాట్లాడుతూ గత 35 మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు పోరాట ఫలితంగా బంధీగా ఉన్న బతుకమ్మ కుంట ను కబ్జాదారుల నుండి కాపాడిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా హైడ్రా ను నియమించడం అర్హనీయమని మొదటి విజయం అంబర్ పేట నుంచి ప్రారంభం కావడం సంతోషమైన విషయమని కృష్ణ గౌడ్ తెలిపారు.



# సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ పండుగ





**డిఆర్డీవో ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు**

**ప్రకృతిని అమ్మగా కొలిచే పవిత్రమైన పండుగ బతుకమ్మ**

**పెవిలియన్ గ్రౌండ్, కలెక్టర్ క్యాంప్ కార్యాలయాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**




**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 29 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం, ప్రకృతిని అమ్మగా కొలిచే పండుగ బతుకమ్మ అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. తొమ్మిదవ రోజు సోమవారం సాయంత్రం ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్, కలెక్టర్ క్యాంపు కార్యాలయాల్లో అట్టహాసంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ దంపతులు పాల్గొన్నారు. ముందుగా గౌరమ్మ తల్లికి పసుపు, కుంకుమతో పూజించి మహిళలతో కలిసి మెలసి బతుకమ్మ ఆడి వారిని ఉత్తేజపరిచారు. తొమ్మిది రోజుల పాటు గౌరమ్మను కొలుచుకొంటూ బతుకమ్మలు పేర్చి ఆడుతూ, పాడుతూ మహిళలు సంబురంగా అమ్మవారిని కొలుస్తూ సంతోష వాతావరణంలో పండుగ నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకలలో జిల్లాలోని వివిధ వర్గాల మహిళలంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.... అంటూ ఆట పాటలతో సందడి చేసారు. ఈ వేడుకల్లో డిఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# గేమింగ్ యాప్స్‌పై సినీప్రముఖులను విచారించనున్న ఈడీ

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ దూకుడు ప్రదర్శిస్తోంది. కురాకో దేశంలో నమోదైన వివాదాస్పద ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ వన్ ఎక్స్‌బెట్ ప్రమోషన్లకు సంబంధించి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలు కోట్ల రూపాయల విలువైన ఆస్తులను అటాచ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నది. పీఎంఎల్ఏ చట్టం కింద ఈ చర్యలు చేపట్టబోతున్నట్టు సమాచారం.ఈ కేసులో బాలీవుడ్ సెలబ్రిటీలు, మాజీ క్రికెటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు , పలువురు ప్రముఖుల పేర్లు ఈడీ రాడార్‌లో ఉన్నాయని తెలుస్తోంది. ప్రమోషన్ల ద్వారా వచ్చిన భారీ మొత్తాన్ని చాలామంది విలాసవంతమైన ఆస్తుల కొనుగోలు కోసం వాడుకున్నారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈడీ, వాటిని క్రిమినల్ ఇన్‌కమ్‌గా పరిగణిస్తూ, ఆస్తులపై తాత్కాలికంగా అటాచ్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేసే దిశగా పకడ్బందీగా పని చేస్తోంది. ఈడీ దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, ఈ సెలబ్రిటీలకు భారతదేశంతో పాటు యూఏఈ వంటి విదేశాల్లో కూడ స్థిరాస్తులు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ ఆస్తులపై పూర్తి నివేదిక సిద్ధం చేస్తూ, వాటిని తాత్కాలికంగా అటాచ్ చేయడానికి అవసరమైన ఆమోదం కోసం అథారిటీకి ఆర్డర్ పంపించనున్నట్టు సమాచారం. ఆమోదం లభించిన తర్వాత ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసి, కోర్టు అనుమతి పొందిన తర్వాత ఆస్తులను శాశ్వతంగా జప్తు చేసే అవకాశముంది. ఈడీ ప్రశ్నించిన సెలబ్రిటీల జాబితాలో పలువురు ప్రముఖులు ఉన్నారు. వీరిలో మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, సురేష్ రైనా, రాబిన్ ఊతప్ప, శిఖర్ ధావన్, నటుడు సోను సూద్,బెంగాలీ నటుడు అంకుష్ హజ్రా,తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి,అలాగే ఉర్వశి రౌతేలా ఉన్నారు. అయితే భారత ప్రభుత్వం ఇటీవల ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కానీ, నిషేధానికి ముందు దాదాపు 22 కోట్ల మంది భారతీయులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు కనెక్ట్ అయ్యారని అంచనా. వీరిలో సగం మంది యాక్టివ్ యూజర్లు కావడం ఆశ్చర్యకరం.ఇప్పటికే విచారణలు ప్రారంభించడంతో పాటు ఆస్తుల జప్తు ప్రక్రియ కూడా ప్రారంభమైన నేపథ్యంలో, పలువురు సెలబ్రిటీలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని సమాచారం.

# రాజాసాబ్ ట్రైలర్ టాక్..

## తాత మాయాజాలంలో ప్రభాస్ అల్లరి!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మొన్నటివరకు చేసిన సినిమాలు ఒక లెక్క ఇప్పుడు రాబోయే సినిమా మరొక లెక్క అనేలా తన లైనప్ ను సెట్ చేసుకుంటున్నాడు. ఇక మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ది రాజాసాబ్ హారర్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ట్రైలర్ పై ముందునుంచి అంచనాలు గట్టిగానే పెంచారు. ఇక రిలీజ్ అవ్వగానే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. రొమాంటిక్ కామెడీతో పాటు హారర్ టచ్ కూడా కలిపి చూపించడం ఈ ట్రైలర్ ను స్పెషల్‌గా నిలిపింది. ప్రభాస్ లుక్, స్టైల్, డైలాగ్ డెలివరీ కాస్త కొత్తగానే ఉన్నాయి. డార్లింగ్ ను కామెడీ యాంగిల్ లో చూసి చాలా కాలమైంది. ఇక ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ లాంటి హీరోయిన్స్ అందరూ స్క్రీన్ లో ఫ్రెష్ వైబ్ ఇచ్చారు. ఇక మహల్ కు సంబంధించిన రహస్యాలు దెయ్యం తాత గెటప్ లో సంజయ్ దత్ భయపెట్టనున్నట్లు తెలుస్తోంది. హారర్ కామెడీలో మంచి పట్టున్న మారుతి ఆ రూట్లో స్ట్రాంగ్ ఎంటర్టైన్మెంట్ ప్లాన్ చేసినట్లుగా అర్థమవుతుంది. ఇక ముగ్గురు భామల మధ్య రొమాంటిక్ డోస్ తో పాటు పలు మాస్ అప్పీల్స్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎమోషనల్ గా బామ్మ సెంటిమెంటును కూడా జత చేసినట్లు అర్థమవుతుంది. సినిమాలో ప్రధానంగా గ్రాఫిక్స్ బాగా ఇన్నట్లు హైలెట్ చేశారు. పొగ నుంచి వచ్చే దెయ్యాలు, వికృత రూపం, మొసలి అలాగే పెద్ద బల్లులు ఇలా గట్టిగానే విజువల్స్ ను చూపించనున్నట్లు అర్థమవుతుంది. ఇక ఈ గ్రాఫిక్స్ పై ఆడియెన్స్ రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాలి. చివరలో తలకిందులుగా మహల్ లో రాజాసాబ్ గెటప్ లో ప్రభాస్ రోల్ డిఫరెంట్ గా ఉంది. ఆ క్యారెక్టర్ కూడా ఫోకస్ అయ్యేలా ఉంది. ప్రత్యేకంగా సాంగ్స్, హారర్ ఎలిమెంట్స్ మిక్స్ కావడంతో ట్రైలర్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీలా కనిపిస్తోంది. మొత్తానికి ది రాజాసాబ్ ట్రైలర్ ప్రభాస్ కెరీర్ లో కొత్తగా ప్రయత్నించిన ఎంటర్‌టైన్‌మెంట్ జానర్ ను చూపించింది. కామెడీ, రొమాన్స్, హారర్ అన్నీ కలిపిన ఈ సినిమా ట్రైలర్ పై ఆడియెన్స్ రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాలి. సినిమాను 2026 జనవరి 9న రిలీజ్ చేయనున్నట్లు ట్రైలర్ తో అఫీషియల్ గా మరో క్లారిటీ ఇచ్చేశారు. ఆ టైమ్ లో కంటెంట్ కాస్త క్లిక్కయినా కలెక్షన్స్ కు తిరుగుండదు. మరి మారుతి మ్యాజిక్ ఎంతవరకు క్లిక్కవుతుందో చూడాలి.



# నేచురల్స్ లుక్స్‌లో డింపుల్‌హయతి

అందం అభినయం ఉన్నా కూడా చాలా మంది హీరోయిన్స్ అదృష్టం కలిసి రాక రేస్ లో వెనకపడుతున్నారు. సినిమా అవకాశాలు అందుకుంటున్నా కూడా సరైన హిట్స్ లేక స్టార్ డమ్ తెచ్చుకోలేకపోతున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నప్పటికీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేక పోతున్నారు. వారిలో డింపుల్ హయాతి ఒకరు. అందం అభినయం ఉన్న ఈ గ్లామర్ బ్యూటీ తన వయ్యారంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇక తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. హీరోయిన్ గానే కాదు.. గెస్ట్ రోల్స్ చేసింది. అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. డింపుల్ హయాతి 2017లో 'గల్ఫ్' సినిమాతో సినీరంగంలోకి వచ్చింది. ఆతర్వాత 2019లో యురేక సినిమాలో నటించింది. అయినా కూడా గుర్తింపు రాలేదు. అదే సమయంలో వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' సినిమాలో 'జర్ర జర్ర ' పాటలో నటించింది. ఈ పాటలో హాట్ లుక్ లో మెరిసి ఆకట్టుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో మరోసారి తన గ్లామర్ తో ఆకట్టుకుంది. చివరిగా రామబాణం అనే సినిమాలో కనిపించింది. కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్. బోగి అనే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాలో డింపుల్ హీరోయిన్ గా ఎంపికైంది. ఇటీవలే ఈ సినిమా నుంచి గ్లింప్స్ విడుదల చేశారు. ఈ సినిమా పై డింపుల్ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మ మంచి విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. మరి ఈ చిన్నదానికి హిట్ అందుతుందేమో చూడాలి. సోషల్ మీడియాలో ఈ చిన్నది షేర్ చేసే ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# క్యూట్ ఫొటోలు షేర్ చేసిన రీతూ వర్మ

తెలుగమ్మాయి రీతూ వర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఈ భామ ఇప్పుడు హీరోయిన్‌గా మారిన సినిమాలు చేస్తోంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ వరుసగా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. కెరీర్ బిగినింగ్ లో పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటించింది ఈ భామ. ఆతర్వాత సినిమాల్లోకి వచ్చింది. ఎన్టీఆర్ హీరోగా నటించిన బాద్షా సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా హీరోయిన్ చెల్లి పాత్రలో మెరిసింది. ఆ తర్వాత కొంత గ్యాప్ ఇచ్చింది. ఇక హీరోయిన్ గా మారి తొలి సినిమాతోనే ఆకట్టుకుంది. 2013లో ప్రేమ ఇష్క్ కాదల్ అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది రీతూ వర్మ. ఈ సినిమా ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోకపోయినా.. ఈ చిన్నది తన నటనతో మెప్పించింది. ఆతర్వాత నా రాకుమారుడు, ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాల్లో హీరోయిన్ గా చేసి ఆకట్టుకుంది. ఇక 2016లో వచ్చిన పెళ్ళిచూపులు సినిమా ఈ బ్యూటీకి మంచి క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆతర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది. నిన్నిలా నిన్నిలా, టక్ జగదీష్, ఒకే ఒక జీవితం, కణం, ఆకాశం, మార్క్ ఆంటోని సినిమాలు చేసింది. ఈ భామ నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాల ఎంచుకుంటూ రాణిస్తుంది. ఇటీవలే శ్రీవిష్ణుతో స్వాగ్ , సందీప్ కిషన్ తో మజాకా సినిమాలు చేసింది. ఈ రెండు సినిమా అంతగా ఆకట్టుకోకపోయినా యావరేజ్ గా మిగిలాయి. ఇప్పుడు ఈ చిన్నది ఓ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందు రానుంది. దేవిక అండ్ డానీ అనే టైటిల్ తో ఈ వెబ్ సిరీస్ రానుంది. ఈ క్రమంలోనే రీతూ వర్మ కొన్ని క్రేజీ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ ఫోటోలు నెటిజన్స్ ను కట్టిపడేస్తున్నాయి.



# ఓజీ' కలెక్షన్ల సునామీ.. నాలుగు రోజుల్లోనే రూ. 252 కోట్లు!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ నెల 25న విడుదలైన ఈ సినిమా, కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 252 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రానికి తొలిరోజే అద్భుతమైన స్పందన లభించింది. విడుదలైన మొదటి రోజే ఏకంగా రూ. 154 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. ఈ భారీ ఓపెనింగ్‌తో, మొదటి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-10 భారతీయ చిత్రాల జాబితాలో 'ఓజీ' చోటు దక్కించుకుంది. నాలుగు రోజుల్లోనే రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరి పవన్ కల్యాణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది.సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో పవన్ కల్యాణ్ 'ఓజాస్ గంభీర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ఆయన స్టైలిష్ లుక్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్, తమన్ అందించిన నేపథ్య సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చాలాకాలంగా అభిమానులు ఆశిస్తున్న అసలైన యాక్షన్ సినిమా ఇదేనంటూ ప్రశంసలు కురుస్తున్నాయి.



# తండ్రి అడుగుజాడల్లో అజిత్ కుమారుడు

తన విజయాల వెనుక భార్య షాలిని హస్తం ఎంతో ఉందని చెబుతూ ప్రముఖ తమిళ నటుడు అజిత్ కుమార్ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారన్న విషయంపై స్పందించారు. భార్య షాలిని సహకారం లేకపోతే తాను ఇంతదూరం రావడం సాధ్యపడేదికాదని అజిత్ స్పష్టంగా పేర్కొన్నారు. "మేము 2002లో పెళ్లి చేసుకున్నాం. అప్పటినుంచి ఆమె నాకు బలంగా నిలిచింది. నేను రేసింగ్‌కు తిరిగి వచ్చినప్పుడు కూడా ఆమె నాతోపాటే వచ్చేది. ఇంటి విషయాలు, పిల్లల సంరక్షణ, నా పనులపై దృష్టి అన్నింటినీ సమర్థంగా నిర్వహించేది అని ఆయన అన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత షాలిని ఎక్కువగా ఇంటికే పరిమితమైపోయినా, మోటార్ స్పోర్ట్స్ పట్ల ఆసక్తిని మాత్రం కొనసాగిస్తోందని తెలిపారు. తన కుమారుడు గో-కార్టింగ్ ప్రారంభించిన విషయాన్ని వెల్లడించిన అజిత్, "అతను రేసింగ్‌ను కొనసాగిస్తాడో లేదో అతడే నిర్ణయించాలి.

